22వ పాఠం

# పుణ్యాత్ముల, ప్రబోధకుల సమాధుల వద్ద ఆరాధన చేయటం నిషిద్ధం

ఆయిషా (ర.అన్హా) కథనం ప్రకారం ఉమ్మె సలమా (ర.అన్హా) ఒకసారి దైవప్రవక్త ముహమ్మద్(సఅసం) ముందు తాను అబిసీనియా దేశంలో  చూసిన చర్చీ గురించి, అందులోని చిత్రాలను, విగ్రహాలను గురించి ప్రస్తావించినప్పుడు దైవప్రవక్త (సఅసం) ఇలా చెప్పారు: "తమలోని సజ్జనుడో లేక పుణ్య పురుషుడో  మరణించినప్పుడు అతని సమాధిపై  వారు ఆరాధనాలయం నిర్మించేవారు.  అందులో  వివిధ చిత్రాలను చిత్రీకరించి, విగ్రహాలను ప్రతిష్ఠించేవారు.  వారు అల్లాహ్ సన్నిధిలో అందరికన్నా హీనులు. వారు రెండు చెడులను ఒకేచోట చేర్చారు. (1) సమాధుల పూజ (2) చిత్రాలను, విగ్రహాలను ప్రతిష్ఠించటం." (బుఖారీ, ముస్లిం)

ఆయిషా (ర.అన్హా) గారిదే మరో కథనం : దైవప్రవక్త (సఅసం)కు మరణ ఘడియలు సమీపించినప్పుడు ఆయన(స) (తీవ్రంగా బాధపడుతూ) తమ ముఖంపై గుడ్డ కప్పుకునేవారు. (ఒక్కోసారి ముఖంపై నుంచి గుడ్డను తొలగించేవారు). ఆ సమయంలో ఆయన (స) ఇలా అన్నారు: "యూదులపై, క్రైస్తవులపై అల్లాహ్ శాపం పడుగాక! వారు తమ ప్రవక్తల సమాధులను ప్రార్థనా మందిరాలుగా చేసుకున్నారు." ఇలా చేయరాదని ఆయన (స) ప్రజలను హెచ్చరించదలిచారు. ప్రవక్తల సమాధులను ప్రజలు ప్రార్థన స్థలాలుగా చేసుకుంటారన్న భయమేగనక లేకుంటే, ఇతర సహచరుల సమాధుల మాదిరిగానే ఆయన (స) సమాధి కూడా బహిరంగ ప్రదేశంలో ఉండేది." (బుఖారీ, ముస్లిం)

https://teluguislam.net

జున్దుబ్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) ఉల్లేఖించారు: దైవప్రవక్త (స) తన మరణానికి ఐదు రోజుల క్రితం ఈ విధంగా చెబుతుండగా నేను విన్నాను – "అల్లాహ్ నాకు ఎంపిక స్వేచ్ఛను ప్రసాదించగా నేను ఆ పరమోన్నత మిత్రుడే (అల్లాహ్‌యే) కావాలని కోరుకున్నాను. అల్లాహ్ ఇబ్రాహీం (అలైహిస్సలాం)ను తన ప్రియ నేస్తం (ఖలీల్)గా చేసుకున్నట్లే నన్ను కూడా తన ప్రియతమ మిత్రునిగా చేసుకున్నాడు. ఒకవేళ నేను నా సహచరులలో ఎవరినయినా నా ప్రియనేస్తంగా చేసుకోవలసి ఉంటే అబూబక్ర్ (రజి)ను నా ప్రియనేస్తంగా చేసుకునేవాణ్ణి. మీకు పూర్వం గతించినవారు తమ ప్రవక్తల గోరీలను ప్రార్థనా స్థలాలుగా చేసుకున్నారు. జాగ్రత్త! మీరు మాత్రం అలా చేయరాదు సుమా! (ముస్లిం)

ప్రవక్త (సఅసం)తన జీవితపు ఆఖరి ఘడియలలో కూడా ఈ చేష్టల నుంచి వారించారంటే, సమాధి పూజ చేసేవారు శాపగ్రస్తులవుతారని హెచ్చరించారంటే ఇదెంత ముఖ్యమైన విషయమో ఊహించవచ్చు. ప్రవక్త (సఅసం) చెప్పిన దాని ప్రకారం గోరీలపై ప్రార్థనాలయాలు నిర్మించటం, గోరీలను పూజించటం, గోరీల దగ్గర నమాజ్ లాంటి ప్రార్థనలు చేసు కోవటం– ఇవన్నీ నిషేధించబడ్డాయి. "తన సమాధిని ప్రజలు ప్రార్థనా స్థలంగా చేసుకుంటారన్న భయమే గనక లేకుంటే......" అని అనటంలోని అంతరార్థం అదే. దైవప్రవక్త ప్రియసహచరులు ఎప్పటికీ ప్రవక్త సమాధిపై మస్జిద్ నిర్మించేవారు కారు. ఎందుకంటే ఏ స్థలంలో నమాజ్ చేయబడు తుందో అది మస్జిద్ (సాష్టాంగ ప్రణామ స్థలం) అనబడుతుంది.

దైవప్రవక్త (స) ఇలా ప్రబోధించారు: **"లా తజ్‌అలూ ఖబ్రీ ఈదన్"** (నా సమాధిని జాతర స్థలంగా చేయకండి.)

https://teluguislam.net

"సమస్త భూభాగం నా కొరకు మస్జిద్‌గా, పరిశుద్ధత పొందే స్థలంగా చేయబడింది" అని దైవప్రవక్త (సఅసం) చెప్పటం గమనార్హం.

*(బుఖారీ, ముస్లిం)*

ఇబ్నె మస్‌వూద్ (రజి) ఉల్లేఖించిన మర్ఫూ హదీసులో మహనీయ ముహమ్మద్ (సఅసం) ఇలా చెప్పారు: "ప్రళయం ఎవరిపై సంభవిస్తుందో (అనగా ఎవరి విషయంలోనైతే ప్రళయ సంకేతాలు నిజం అవుతాయో) వారు జనులలోకెల్లా అధములు. సమాధులను ప్రార్థనా స్థలాలుగా చేసుకున్న వారు కూడా హీనాతిహీనులే" (ప్రామాణిక ఆధారాలతో అహ్మద్ దీనిని తన ముస్నద్‌లో పొందుపరిచారు. అబూ హాతిమ్ కూడా దీనిని ప్రమాణబద్ధంగా సంగ్రహించారు)

## ఈ పాఠంలోని ప్రధానాంశాలు

- పుణ్యపురుషుల సమాధుల దగ్గర మస్జిద్‌ను నిర్మించటం పట్ల దైవ ప్రవక్త (సఅసం) గట్టిగా హెచ్చరించారు. మస్జిద్ నిర్మాణం సదుద్దేశంతో చేసినా అది వాంఛనీయం ఎంత మాత్రం కాదు.
- విగ్రహాలను తయారు చేయటం నిషిద్ధం.
- గోరీలపై కట్టడాలను నిర్మించే చేష్ట అంతకు ముందు నుంచే నిషేధించబడి ఉన్నప్పటికీ, మహాప్రవక్త (సఅసం) తన మరణానికి ఐదు రోజుల ముందు మరోసారి దాన్ని ప్రస్తావించి, అలాంటివారిపై అల్లాహ్ శాపం పడుతుందని చెప్పటం, అలాంటి చేష్టలకు పాల్పడరాదని తన అనుచర సమాజాన్ని హెచ్చరించటం ప్రత్యేకంగా ఆలోచించదగిన విషయం. దీన్నిబట్టి ఈ చేష్ట ఎంత వికృతమయినదో అవగతమవుతోంది.

https://teluguislam.net

- మహాప్రవక్త (సఅసం) తన సమాధిని ఆరాధనాలయంగా చేసుకో రాదని గట్టిగా వారించారు.
- ఇలాంటి చర్యకు ఒడిగట్టిన యూదులను, క్రైస్తవులను ఆయన (స) అసహ్యించుకున్నారు.
- తన సమాధి పట్ల ముస్లింలు మితిమీరి ప్రవర్తించరాదన్న ఉద్దేశం తోనే మహాప్రవక్త (సఅసం) ఇంత గట్టిగా తాకీదు చేయాల్సి వచ్చింది.
- మహాప్రవక్త (సఅసం) సమాధి బహిరంగ ప్రదేశంలో లేకుండా జాగ్రత్తపడటంలోగల అంతరార్థం కూడా అదే.
- సమాధులను ఆరాధనాలయం (మస్జిద్)గా చేసుకునే పోకడ వెనుక ఏఏ కారణాలు, ఏఏ పరిస్థితులు ఉంటాయో కూడా ఈ సందర్భంగా విడమరిచి చెప్పబడింది.
- ప్రవక్తల గోరీలను ప్రార్థనాలయాలుగా చేసుకునే వారిని, ప్రళయం సంభవించబోయే వారిని ఒకేచోట చేర్చి హెచ్చరించటం కూడా గమనార్హ విషయమే. తన అనుచర వర్గంలో బహుదైవారాధన, అవిశ్వాసం ఎలా ప్రబలుతుందో, వాటి స్వభావ స్వరూపాలు ఎలా ఉంటాయో దైవప్రవక్త (సఅసం) క్షుణ్ణంగా వివరించారు.
- మహాప్రవక్త (సఅసం) తన మరణానికి అయిదు రోజుల క్రితం చేసిన హెచ్చరికను బట్టి రాఫిజా, జహ్మియా అనే రెండు వర్గాలు మార్గవిహీనతకు లోనైన వర్గాలని అర్థమవుతున్నది. కొంతమంది విద్వాంసులు ఈ రెండు వర్గాలను 72 వర్గాలలోకి చేర్చరు. సమాధిపై మస్జిద్‌ను నిర్మించే చేష్టకు ప్రప్రథమంగా పాల్పడినది రాఫిజా వర్గీయులే. వాళ్ళ వల్లనే ముస్లిం సముదాయంలో షిర్క్, బిద్అతులు చోటు చేసుకున్నాయి.

https://teluguislam.net

- దైవప్రవక్త (సఅసం) మరణానికి ముందు నొప్పితో బాధపడినట్లు తెలుస్తోంది.
- అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం)కు అల్లాహ్ యొక్క ప్రియతమ నేస్తం (ఖలీల్) అయ్యే భాగ్యం దక్కింది.
- ప్రవక్త ప్రియసహచరులందరిలోకీ అబూ బక్ర్ (రజి) శ్రేష్ఠులన్న సంగతి కూడా విదితమవుతోంది.
- తన తదనంతరం అబూబక్ర్ (రజి) ఖలీఫా (ముస్లిం రాజ్యనేత)గా ఎన్నుకోబడతారని మహాప్రవక్త (సఅసం) సూచనాప్రాయంగా తెలియజేశారు.

## మోడల్ ప్రశ్నలు

1) ప్రవక్త (స) సమాధిని ప్రార్థన స్థలంగా మార్చకండి అని చెప్పిన ఏవైనా రెండు హదీసులు వ్రాయండి?
2) ప్రవక్త (స) యూదులను, క్రైస్తవులను ఎందుకు శపించారు?
3) సమాధులపై కట్టడాలు నిర్మించటం ఎంత వరకు సమంజసం?

## ఖాళీలు పూరించండి

1) దైవప్రవక్త (స) మరణానికి ముందు ....... తో బాధపడ్డారు.
2) సహచరులందరిలోకి ............... శ్రేష్ఠులు.
3) ప్రవక్త (స)............., ............. లను అసహ్యించుకున్నారు.
4) ప్రవక్త (స) తన ............ను ఆరాధనాలయంగా చేసుకోరాదని గట్టిగా వారించారు.

https://teluguislam.net